ప్రజాశక్తి
ఆదివారం 14 జూలై, 2024
5
శ్రీకాకుళం

నేడు ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహించనున్నట్టు రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి జి.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు హాజరుకానున్నట్టు తెలిపారు. జిల్లాలోని ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు హాజరుకావాలని కోరారు.

ఉద్యోగాల వల... బాధితుల విలవిల



సతీష్‌బాబు ఇచ్చిన ప్రాంశరీ నోటీసు



కార్యదర్శి సతీష్‌బాబు ఇచ్చిన బ్లాంక్ చెక్

మన్నం సతీష్‌బాబు వేస్తున్న ఉద్యోగాల వలలో చిక్కుకుని జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో బాధితులు విలవిలలాడుతున్నారు. 2003లో కాంట్రాక్టు పద్ధతిలో పంచాయతీ కార్యదర్శి ఉద్యోగంలో చేరిన సతీష్‌బాబు 2014లో కిరణ్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి హయాంలో శాశ్వత ఉద్యోగిగా మారాడు. అయితే ఈ ఇరవై ఏళ్లలో అతడు సాగించిన దోపిడీ, దందాల గురించి తెలుసుకుంటే ముక్కున వేలేసుకోవాల్సిందే. ప్రభుత్వం బడుగు బలహీనవర్గాలకు అందించే పింఛన్ల సొమ్ము కాజేయడంతో ప్రారంభమైన అతని అక్రమార్జన ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న వారిని గుర్తించి, వారిని ప్రలోభాలకు గురిచేసి డబ్బులు వసూలు చేయడంతో కోట్లకు చేరుకుంది.

- కోట్లలో వసూలు చేసిన కార్యదర్శి సతీష్‌బాబు!
- బాధితుల ఫిర్యాదుతో వెలుగులోకి...
- దీని వెనుకున్న పెద్దలెవరో?

ప్రజాశక్తి- కవిటి

ఈ ఇరవై ఏళ్ల ఉద్యోగంలో ఎన్నిసార్లు షోకాజ్ నోటీసులు జారీ చేసినా, సస్పెండ్ చేసినా, ఎసిబికి ప్రత్యక్షంగా చిక్కినా చలించకుండా... మళ్లీ అదే ఉద్యోగంలో కొనసాగడం, అదేదందాలు చేస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తనని మోసం చేశాడని శ్రీకాకుళం నగరంలోని శ్రీనివాస నగర్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న గౌరీశంకర్ శ్రీకాకుళం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. తీగలాగితే డొంక కదిలినట్టు సతీష్‌బాబు చేసిన దందా లక్షల్లో కాదని, కోట్లలో జరిగిందని తెలుస్తోంది. ఇందులో మరో ముఖ్య అంశం ఈ వ్యవహారంలో ప్రభుత్వ ఉపాధ్యాయనిగా పనిచేస్తున్న సతీష్‌బాబు భార్య హస్తం కూడా ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది.

కార్యదర్శి ఉద్యోగం ఇప్పిస్తానని..

గతంలో పలాస మండలం లొత్తూరు పంచాయతీలో సామాజిక పింఛన్లు కాజేసిన సతీష్‌బాబు కొద్దిరోజులు పరారయ్యాడు. ఆ తరువాత విధుల్లో చేరి మళ్లీ తన దందా ప్రారంభించాడు. కోటబొమ్మాళి, సరుబుజ్జిలి, శ్రీకాకుళం మండలాల్లో పనిచేస్తున్నప్పుడు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి పలువురి వద్ద లక్షల్లో వసూలు చేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. అదేవిధంగా కవిటి, ఇచ్ఛాపురం మండలాలకు చెందిన పలువురు బాధితులకు 2013లో పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి సుమారు రూ.50 లక్షల వరకూ వసూలు చేశాడు. పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం ఎలా వస్తుందంటే తమతో పాటే విధుల్లో చేరినవారు వివిధ కారణాలతో ఉద్యోగం మానేశారని, వారి స్థానంలో మిమ్మల్ని నియమించేలా చేస్తానని బాధితులను నమ్మించాడు. అంతేకాకుండా బాధితులు ఇచ్చిన డబ్బులు ఉన్నతాధికారులకే ఇస్తానని, వారు ఎంతైనా ఇస్తే తాను తీసుకుంటానని చెప్పేవాడు. ఆ విధంగా కలెక్టర్ కార్యాలయం వద్దకు పలుమార్లు బాధితులను తీసుకువెళ్లి ఎవరెవరినో పిలిచి వారికి డబ్బులు ఇప్పించేవాడు. కాలం గడుస్తున్నా ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు సతీష్‌బాబును నిలదీశారు. దీంతో ఫోన్ స్విచ్ఛాఫ్ అని రావడంతో బాధితులు సతీష్‌బాబు ఇంటికి వెళ్లి విచారించారు. ఇంట్లో ఉన్న సతీష్‌బాబు భార్య కొద్దిరోజులు సమయం ఇస్తే తాను డబ్బులు ఇస్తానని హామీ ఇచ్చారు. అదీ జరగకపోగా ఇద్దరూ ఇల్లు, ఫోన్ నంబర్లను మార్చి వేరే ప్రాంతానికి మారిపోయారు. సతీష్‌బాబు కోసం తిరుగుతున్న బాధితులు 2015లో ఎలాగోలా పట్టుకుని కవిటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడకు వచ్చిన సతీష్‌బాబు భార్య బాధితులకు తాను డబ్బులు చెల్లిస్తానని హామీ ఇచ్చి కేసు లేకుండా భర్తను విడిపించింది. అప్పుడు కవిటి మండలం నుంచి కొట్టుకునిపోయిన సతీష్‌బాబు మళ్లీ ఇప్పుడు శ్రీకాకుళం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో తేలాడు. ఇవి కేవలం కొన్ని సంఘనలు మాత్రమే. సతీష్‌బాబు దోపిడీకి గురై పలువురు బాధితులు వలసలు పోగా కొన్ని కుటుంబాలు విచ్ఛిన్నమైపోయాయి. జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగులే లక్ష్యంగా కోట్లలో వసూళ్లు చేసిన సతీష్‌బాబు ఎక్కడ దాచాడు. ఎవరెవరి ప్రమేయం ఉంది. ప్రభుత్వ ఉద్యోగులైన ఈ ఇరువురి భార్యాభర్తలకు ప్రభుత్వం ఏం చేయటుంది? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

ఆయన భార్య ప్రమేయంతోనే..

సతీష్‌బాబు వ్యవహారం వెనుక భార్య పూర్తి సహకారం ఉందనేది స్పష్టంగా తెలుస్తోంది. తాము సతీష్‌బాబు కోసం వెళ్లినప్పుడు కానీ, అతన్ని పోలీసులకు అప్పగించినప్పుడు కానీ ఆమె చొరవతోనే సతీష్‌బాబు బయటపడ్డాడని బాధితులు చెబుతున్నారు. కానీ, బాధితులకు మాత్రం ఆమె న్యాయం చేయలేదు. ఒక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయనిగా చేస్తున్న ఆమె అప్పట్లో శ్రీకాకుళం మహిళా పాఠశాలలో విధులు నిర్వహించేవారు. ఆ తరువాత పాతపట్నం బదిలీ అయినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె ఎక్కడ విధులు నిర్వహిస్తోందో తెలియాల్సి ఉంది.

ఇంత జరుగుతున్నా, జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నా, అదేపనిగా సస్పెండ్ అవుతున్నా సతీష్‌బాబు ఉద్యోగం ఎలా చేస్తున్నాడు. ఉన్నతాధికారుల పేరుతో దందా చేస్తున్నా వారి దృష్టికి రాలేదా? వచ్చినా మిన్నకుండిపోయారా? అసలు తన ఉద్యోగ జీవితమే దోపిడీ వ్యాపారంగా మార్చుకుని, ఇంతమందిని మోసగించి, కొన్ని కుటుంబాల వేదనకు కారణమైన సతీష్‌బాబు ఉద్యానికి అర్హుడా? అతనికి సహకరిస్తున్న భార్య సుజాత భావి తరాలకు ఏ విధమైన చదువు చెబుతుంది? అంటూ బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

న్యాయం చేయండి

పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం ఇప్పిస్తానని 2013లో మన్నం సతీష్‌బాబు నావద్ద విడతల వారీగా రూ.5.50 లక్షలు తీసుకున్నాడు. పలుమార్లు కలెక్టరేట్ వద్దకు తీసుకువెళ్లి ఎవరెవరినో పరిచయం చేసేవాడు. ఆ తరువాత మొహం చాటేయడంతో నేను వాళ్లింటికి వెళ్లాను. అప్పుచేసి డబ్బులు ఇచ్చానని చెప్పడంతో అతని భార్య డబ్బులు ఇస్తానని హామీ ఇచ్చింది. ఆ తరువాత కొన్ని రోజులు తిప్పించి బ్లాంక్ చెక్ ఇచ్చారు. అది చెల్లలేదు. అక్కడికి కొన్ని రోజులకు ఇల్లు మారిపోయి, సెల్‌ఫోన్ నంబర్లను మార్చేశారు. ఆమె పనిచేస్తున్న పాఠశాల వద్దకు వెళ్లి విచారిస్తే ఆమె బదిలీ అయినట్టు తెలిసింది. అప్పటి నుంచి కనిపించలేదు. మళీల ఇప్పుడు పేపర్లో చూశాను. అయితే నాకు ఇవ్వాల్సిన డబ్బులు గురించి సతీష్‌బాబు, అతని భార్య నాతో మాట్లాడిన మాటల ఆడియోలు, నాకు ఇచ్చిన బ్లాంక్ చెక్, ప్రాంశరీ నోటు నావద్ద భద్రంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాకు న్యాయంచేసి నా డబ్బులు ఇప్పించి, గత ఇరవై ఏళ్లుగా అటు ప్రభుత్వాన్ని, ఇటు ప్రజల్ని మోసం చేస్తున్న ఇటువంటి ఉద్యోగుల్ని శాశ్వతంగా తొలగిస్తే మిగతావారికి గుణపాఠం అవుతుంది.

- పి.వాసుదేవరావు, బాధితుడు, కవిటి

ఎస్‌పిగా కె.వి మహేశ్వర్‌రెడ్డి

జి.ఆర్ రాధిక బదిలీ

ప్రజాశక్తి- శ్రీకాకుళంప్రతినిధి

మహేశ్వర్‌రెడ్డి, ఎస్‌పి

జిల్లా నూతన ఎస్‌పిగా కె.వి.మహేశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఐపిఎస్‌లను బదిలీ చేస్తూ... ప్రభుత్వం శనివారం జిఒ నంబరు 1252 విడుదల చేసింది. ఇందులో భాగంగా అల్లూరి జిల్లా రంపచోడవరం ఒఎస్‌డిగా పనిచేస్తున్న ఆయనను శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేసింది. ఇప్పటివరకు ఎస్‌పిగా పని చేసిన జి.ఆర్.రాధికను తదుపరి పోస్టింగ్ కోసం డిజిపి కార్యాలయానికి రిపోర్టు చేయాల్సిందిగా సూచించింది. ఎస్‌పి కె.వి.మహేశ్వర్‌రెడ్డి 2019 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. కడపకు చెందిన ఈయన సివిల్స్‌లో 126 ర్యాంకు సాధించి ఐపిఎస్‌కు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం 2020లో ఈయనను ఎపికి కేటాయించింది. 2022లో చిత్తూరు ఎఎస్‌పిగా పనిచేశారు. ఆ తర్వాత రంపచోడవరం ఒఎస్‌డిగా పనిచేస్తూ జిల్లాకు బదిలీపై వస్తున్నారు.

శాంతి భద్రతల్లో జి.ఆర్ రాధిక ప్రత్యేక ముద్ర

ఎస్‌పి జి.ఆర్.రాధికను బదిలీ చేసినా ప్రభుత్వం ఆమెకు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. డిజిపి కార్యాలయానికి రిపోర్టు చేయాల్సిందిగా సూచించింది. శాంతిభద్రతల విషయంలో ఎస్‌పి జి.ఆర్.రాధిక తనదంటూ ప్రత్యేక ముద్ర వేశారు. కేసుల ఛేధన, చోరీ సొత్తు రికవరీపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు దక్కించుకున్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణలో కఠినంగా వ్యవహరించారు. నాటుసారా తయారీ, అక్రమ రవాణపై ఉక్కుపాదం మోపారన్న పేరు సొంతం చేసుకున్నారు. జిల్లాలో శాంతియుతంగా ఎన్నికల నిర్వహణలో విజయవంతమయ్యారన్న పేరు దక్కించుకున్నారు. ఒక పోలీసు అధికారిగా విధుల్లో కఠినంగా ఉంటూనే వ్యక్తిగా పలు సందర్భాల్లో తన మానవత్వం చాటుకున్నారు. నరసన్నపేట జాతీయ రహదారిపై తీవ్రంగా గాయపడి రక్తమడుగులో ఉన్న వ్యక్తిని చూసి ఆమె తన వాహనాన్ని ఆపి దగ్గరుండి వైద్య సేవలు అందించారు. మరో సందర్భంలో నందిగాం సమీపంలో జరిగిన ప్రమాదంలో లారీలో చిక్కుకున్న డ్రైవర్‌ను, క్లీనర్‌ను ఆమే స్వయంగా కాపాడారు. శ్రీకాకుళం నగరంలో గాంధీ పార్కు సమీపంలో నిస్సహాయ స్థితిలో పడి ఉన్న అనాథను దగ్గరుండి అనాథశరణాలయానికి చేర్చి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన గ్రీవెన్స్ నిర్వహణలోనూ ఆమె తన ప్రత్యేకతను చాటుకున్నారు. బాధితులు చెప్పిన కష్టాలను స్వయంగా విని అప్పటికప్పుడు సంబంధిత సిఐ, ఎస్‌ఐలకు ఫోన్ చేసి సత్వర న్యాయం జరిగేలా ఆదేశించేవారు.

పశుపోషకులకు ప్రోత్సాహం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

అచ్చెన్నాయుడు

వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలను ప్రోత్సహించడానికి, గ్రామీణ పేదల జీవనోపాధిని మెరుగుపరచడానికి టిడిపి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ, ఎపి పశుసంవర్ధకశాఖ నిర్వహణలో గ్రామీణ ప్రాంతాల్లోని పశువుల పెంపకందారులకు ప్రోత్సహిస్తున్నామని అన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెల్టర్ల నిర్మాణాలకు రాయితీపై అర్హులందరికీ అమలు చేస్తామని పేర్కొన్నారు. పశువుల షెడ్ల నిర్మాణాలకు 90 శాతం రాయితీపై గరిష్టంగా యూనిట్‌కు రూ.2,30,000 వరకు, గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణాలకు 70 శాతం రాయితీపై గరిష్టంగా యూనిట్‌కు రూ.2,30,000 వరకు, కోళ్ల పెంపకం షెడ్ల నిర్మాణాలకు 70 శాతం రాయితీపై గరిష్టంగా యూనిట్‌కు రూ.1,32,000 వరకు రాయితీ లభిస్తుందని తెలిపారు. అన్ని జిల్లాల్లో పథకం అమలు మార్గదర్శకాలు విడుదల చేస్తామన్నారు.

గెజిట్ కాపీల ప్రతుల దహనం

ప్రజాశక్తి- సోంపేట

ప్రతులను దహనం చేస్తున్న యుటిఎస్ నాయకులు

సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షగా ఉందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం బ్యాక్ డేట్‌తో జిపిఎస్ అమలు చేస్తూ రాజపత్రాన్ని విడుదల చేయటం దుర్మార్గమని అన్నారు. ఈ మేరకు రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు సోంపేటలో శనివారం గెజిట్ కాపీలను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 అక్టోబరు నుంచి సిపిఎస్ ఉద్యోగులందరినీ జిపిఎస్‌లోకి తెస్తూ రాజపత్రాన్ని ఇప్పుడు విడుదల చేయటం ఉద్యోగ, ఉపాధ్యాయులు మోసపుచ్చుటమేనని అన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మురళీప్రకాష్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఈ రాజపత్రాన్ని రద్దు చేయాలని, తక్షణమే పాత పెన్షన్‌ని పునరుద్ధరించడానికి కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ని తక్షణం అమలు చేసి 2003 డిఎస్‌సి ద్వారా ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులందరినీ తిరిగి పాత పెన్షన్‌లోకి పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సోంపేట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కూర్మారావు, దొరబాబు, కంచిలి మండల ప్రధాన కార్యదర్శి నల్లాన రవికుమార్, కుమారస్వామి, త్రినాథ్, రవికుమార్, నాగరాజు, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మెళియపుట్టిలో గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను ఎపిటిఎఫ్ నాయకులు టి.కామేశ్వరావు, జె.ధర్మారావు దహనం చేశారు.

దిశానిర్దేశంగా నిలిచిన 'థర్మల్' పోరాటం

నేడు అమరవీరుల 14వ సంస్మరణ సభ

ప్రజాశక్తి- సోంపేట

పర్యావరణ పరిరక్షణకు ప్రజలే నాయకులై ముందుండి నడిపించిన సోంపేట థర్మల్ పోరాటం దేశంలోని ప్రజా ఉద్యమాలకు దిశానిర్దేశం చేసిందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. కార్పొరేట్ల ధనదాహానికి పచ్చని బీల ప్రాంతం కనుమరుగు కావడమే కాకుండా పరిసర ప్రాంత ప్రజల జీవనం అస్తవ్యస్తమవుతుందన్న భయాందోళనల నేపథ్యంలో ప్రజలే ముందుండి విజయవంతం చేసిన ఉద్యమంగా సోంపేట థర్మల్ ఉద్యమం ఖ్యాతికి ఎక్కింది. థర్మల్ పోరాటంలో అసువులు బాసిన మృతుల జ్ఞాపకార్థం జూలై 14న ఏటా ఏటా సంస్మరణ సభను నిర్వహించి వారి త్యాగాలను నెమరువేసుకోవడం ఈ ప్రాంత ప్రజలకు ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం అమరవీరుల ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామంటూ వారికి ఘన నివాళ్లర్పించేందుకు ఈ ప్రాంత ప్రజలు సిద్ధమవుతున్న వేళ 'ప్రజాశక్తి' ప్రత్యేక కథనం.

సోంపేట బారువ రహదారికి సమీపంలోని బీల ప్రాంతంలో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 1107 జిఒ జారీ చేసింది. వేళల్లోని భూములను ఎన్‌సిసి కంపెనీకి ధారదత్తం చేస్తూ... ప్రభుత్వం జారీ చేసిన జిఒను రద్దు చేయాలని కోరుతూ ఈ ప్రాంత ప్రజలు పర్యావరణ పరిరక్షణ సమితి, తీర ప్రాంత మత్స్యకార ఐక్యవేదిక పేరిట ఉద్యమాన్ని ప్రారంభించారు. సోంపేట వేల ప్రాంతాన్ని రక్షించుకునేందుకు 2009 డిసెంబరు 5న నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఒకవైపు ప్రజా ఉద్యమాన్ని నిరసనలతో కొనసాగిస్తూనే మరోవైపు న్యాయం పరమైన పోరాటాన్ని కొనసాగించారు. థర్మల్ వ్యతిరేక పోరాటానికి పర్యావరణ పరిరక్షణ సమితి, మత్స్యకార ఐక్యవేదికలు చేసిన కృషిని గుర్తించి దేశం నలుమూలల నుంచి వివిధ ప్రజా హక్కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సోంపేట థర్మల్ పోరాటానికి తమ మద్దతును తెలియజేశాయి. థర్మల్ పోరాటానికి మద్దతు తెలుపుతున్న ప్రజలు, ప్రజాసంఘాల విలువను గుర్తించిన రాజకీయ పార్టీలు సైతం ప్రజా ఉద్యమానికి బాసటగా నిలిచాయి. ఈ క్రమంలో బీల భూముల్లో నిర్మాణాలు చేపట్టేందుకు 2010 జూలై 14న ఎన్‌సిసి కంపెనీ ప్రయత్నాలు ప్రారంభించింది. దాన్ని అడ్డుకునేందుకు వేలాది మందిగా వచ్చిన ప్రజలు, రైతులపై పోలీసులు లాఠీఛార్జీలతో పాటు కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో అమాయకులైన నలుగురు రైతులు అసువులు బాసారు. దీంతో కోపోద్రుకలైన ప్రజలు పోలీసులపై తిరగబడి వారిని తరిమికొట్టారు. ఈ ఘటన దేశంలోనే పెను సంచలనంగా మారింది. ప్రజా ఉద్యమాలకు ఊపిరి పోసిందంటూ పలువురు మేధావులు వ్యాఖ్యానించారు. అనంతరం జరిగిన పరిణామాలు అనంతరం 2015లో అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం 1107 జిఒను రద్దు చేసింది. అయితే ఇప్పటికీ బీల భూములు ఎన్‌సిసి కంపెనీ ఆధీనంలోనే ఉన్నారు. ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన 329 జిఒ ప్రకారం ఆ భూముల్లో బహుళజాతి కంపెనీలు ఏర్పాటు చేసుకోవచ్చన్న నిర్ణయం ఇక్కడి ప్రజల గుండెల్లో గుబులు రేపుతూనే ఉంది. అయితే ఈ జిఒ అమలపై పర్యావరణ పరిరక్షణ సమితి మచ్చుకారైకి వేడుకలు హైకోర్టులో కేసు వేసి స్టే ఆర్డర్‌ను తీసుకొచ్చారు. దీంతో ప్రస్తుతం ఇటువంటి కార్యకలాపాలు జరగడం లేదు. అయితే 329 జిఒను సైతం పూర్తిస్థాయిలో రద్దు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దేశవ్యాప్తంగా ఖ్యాతికెక్కన సోంపేట థర్మల్ ఉద్యమంలో అన్ని తరగతుల ప్రజలు తమ వంతు బాధ్యతలను నిర్వర్తించారని, ఇదే స్ఫూర్తితో ప్రజలంతా ఏకమైతే ఏ ప్రభుత్వాలు ప్రజల హక్కులను కాల రాయలేవని ప్రజాసంఘాల నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

సోంపేట థర్మల్ ఉద్యమ అమరుల స్థూపం

బీలను సంరక్షిత ప్రాంతంగా ప్రకటించాలి

వివిధ జాతుల పక్షులు, సుమారు 118 రకాల ఔషధాలకు నిలయమైన బీల ప్రాంతాన్ని ప్రభుత్వం సంరక్షిత ప్రాంతంగా ప్రకటించాలి. సామాన్యుల పోరాటం తమ జీవించే హక్కు కోసమే కాదు పర్యావరణ పరిరక్షణ కోసం అంటూ చాటి చెప్పిన ఉద్యమం ఇది. థర్మల్ ఉద్యమం దేశంలోనే కాక ప్రపంచంలో జరిగిన ప్రజా ఉద్యమాల్లో ఒక విజయవంతమైన ఉద్యమంగా పేరుగాంచింది. ఇదే స్ఫూర్తి మున్ముందు కొనసాగుతుంది.

- డాక్టర్ వై.కృష్ణమూర్తి, పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు

రాజకీయ వేధింపులు ఆపాలి

ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

గార : అంగన్వాడీ కార్యకర్తలపై రాజకీయ వేధింపులు ఆపాలని, లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్. అమ్మన్నాయుడు, ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి హెచ్చరించారు. మండలంలోని శ్రీకూర్మం పంచాయతీ ముద్దాడపేటలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యాన శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు ముద్దాడపేట మినీ అంగన్వాడీ కార్యకర్తను రాజీనామా చేసి తన ఉద్యోగం వదులుకోవాలని, తమ వారిని నియమించుకుంటామని వేధిస్తూ... ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. ఉద్యోగానికి రాజీనామా చేయాలని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిరుద్యోగిని వేధించడం అన్యాయమన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఇలాంటి రాజకీయ వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ, నాయకులు జె.కాంచన, వాగ్దేవి, ఎస్.కమల, రాజు, రుక్మిణి పాల్గొన్నారు.

మండల గణాంకాధికారుల భర్తీకి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వినతిపత్రం అందజేస్తున్న సిపిఒ ఉద్యోగులు

రాష్ట్రవ్యాప్తంగా మండలస్థాయిలో గణాంకాధికారి పోస్టుల ఖాళీలను భర్తీ చేయడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదిరి పురుషోత్తం నాయుడు హామీ ఇచ్చారు. శ్రీకాకుళంలో జిల్లా గణాంక, స్టాటస్టికల్ ఆఫీసర్ల అసోసియేషన్ నాయకులు సుధాకర్ ఆయనను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గణాంకశాఖ ఉద్యోగులు శాఖాపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. ప్రధానంగా జిల్లాలో సగం మండలాల్లో గణాంక శాఖాధికారులు లేరని, దీనవల్ల మిగిలిన వారిపై పని ఒత్తిడి పెరుగుతోందని వివరించారు. అలాగే ఉప గణాంకాధికారి పోస్టులను గజిటెడ్ హోదా కల్పించాలని కొన్నేళ్లుగా కోరుతున్నామని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సచివాలయ వ్యవస్థను రిక్లెఫికేషన్ చేసిన సమయంలో తమ సమస్యలను పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు. అత్యధిక విద్యార్హత కలిగిన ఉద్యోగులు శాఖలో పనిచేస్తున్నా... సుదీర్ఘకాలం పాటు ఉద్యోన్నతులు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో బడగల పూర్ణచంద్రరావు ఉన్నారు.

కూటమి ప్రభుత్వ తొలి షాక్

వీక్షణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వం కొలువు దీరి ఈ నెల 12 నాటికి సరిగ్గా నెల రోజులైంది. ఎన్నికల్లో తమకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం ఏం చేయబోతుందా? అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీరితో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులూ వారికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందా? అని వేచిచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి మంచి నిర్ణయాలు పక్కన పెడితే ఈ నెల 12న గ్యారంటీ పెన్షన్ స్కీం (జిపిఎస్)పై ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ వెలువరించడాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులు జీర్ణించుకోలేకపోతున్నారు. గత ప్రభుత్వ హయాంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఓల్డ్ పెన్షన్ స్కీం (ఒపిఎస్) అమలు కోసం ఎంతగా కొట్లాడారో మనం చూశాం. తాము అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చేశారు. ఒపిఎస్‌పై అవగాహన లేక హామీ ఇచ్చామని, అంతకంటే మెరుగైన పెన్షన్ విధానం తీసుకొస్తామంటూ అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సెలవిచ్చారు. ఆ తర్వాత దానిపై వైసిపి ప్రభుత్వం రకరకాల కమిటీలు వేసి కొంతకాలం కాలయాపన చేసింది. చివరకు సిపిఎస్ స్థానంలో ఉద్యోగులకు మరింత నష్టం చేసే జిపిఎస్‌ను తీసుకొచ్చింది. దానిపై ఆర్డినెన్స్ తీసుకొచ్చి గెజిట్ నోటిఫికేషన్ విడుదలకూ ప్రయత్నించింది. ఎన్నికలకు ఏడాది సమయమే ఉండటంతో ప్రభుత్వం రిస్క్ తీసుకోవడానికి సాహించలేదు. దీనిపై ఉద్యోగులు ఓటు ఫర్ ఒపిఎస్ అనే నినాదంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశారు. పోరాటాల ఫలితంగా తాత్కాలికంగా గతంలో జిఒను విడుదల చేయకుండా వెనక్కు తగ్గింది. సిపిఎస్ రద్దుకు హామీ ఇచ్చి మోసగించిన వైసిపి ఎన్నికల్లో భారీ మూల్యమే చెల్లించుకుంది.

ఎన్నికల సమయంలో వైసిపిపై దీనిపై మాట్లాడకపోయినా కూటమి తరుపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో దీనిపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. సిపిఎస్ రద్దు, వైసిపి తీసుకొచ్చిన జిపిఎస్‌పై ఉద్యోగ సంఘాలతో చర్చించి, వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించిన తర్వాతే పెన్షన్ విధానం అమలు చేస్తామని మాటిచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి పెద్దలు ఇప్పుడు ఏ చర్చా లేకుండానే జిపిఎస్‌పై గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం ఉద్యోగులను షాక్‌కు గురిచేసింది. పైగా ఏమీ ఎరగనట్టు అప్పటి ఆర్థికశాఖ కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ జూన్ 12న జిఒ నంబరు 54ను విడుదల చేశారని, గత ప్రభుత్వం రూపొందించిన నోటిఫికేషన్‌నే గెజిట్‌లో అప్‌లోడ్ చేశామంటూ టిడిపి కూటమి ప్రభుత్వం నమ్మబలుకుతోంది. జూన్ 12న జిఒ జారీ అయ్యిందంటే కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాతే ఇది జరిగిందన్న మాట. కూటమి ప్రభుత్వం వస్తుందన్న గట్టి నమ్మకంతో ఎన్నికల ఫలితాలు వెలువడక ముందే ఈ ఫైలింగ్‌పై అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లేఖ రాసి నిలుపుదల చేయించారు. గత ప్రభుత్వం ట్రైనీ ఐఎఎస్‌లకు ప్లేస్‌మెంట్‌లు కేటాయిస్తున్నారన్న సమాచారంతో కేంద్రానికి సైతం చంద్రబాబు ఫిర్యాదు చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఫైల్ మాయం కాకుండా గనులశాఖ, సిఐడి కార్యాలయాలను సీజ్ చేయించారు. గత ప్రభుత్వ పాపాలపై ముందుస్తు చర్యలు తీసుకున్న చంద్రబాబు జిపిఎస్ జిఒను ఎందుకు ఆపలేకపోయాన్న చర్చ ఉద్యోగుల్లో సాగుతోంది. ప్రభుత్వ ఉద్దేశపూర్వకంగానే జిపిఎస్‌ను తీసుకొచ్చి ఆ నెపాన్ని వైసిపి ఖాతాల్లో వేయాలని చూస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఒపిఎస్‌తో పాటు ఇతర సమస్యలపై కొత్త ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందన్న ఆశలు పెట్టుకున్న ఉద్యోగులను ఆదిలోనే వంచించడం ద్వారా ప్రభుత్వ వ్యతిరేకతకు తానే బీజం వేసుకుంది.

కక్ష సాధింపు చర్యలు లేవంటూనే టిడిపి కూటమి ప్రభుత్వం తన పని తాను చేసుకువెళ్తున్నట్లుగా కనిపిస్తోంది. కొత్త తరహాలో వేధింపులకు స్వీకారం చుడుతున్నట్లు పరిణామాల బట్టి తెలుస్తోంది. వైసిపి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలపై టిడిపి ఎమ్మెల్యేలతోనే ఫిర్యాదులు చేయించి పోలీస్ కేసులు నమోదు చేయిస్తున్న పరిస్థితిని మనం చూస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో చంద్రబాబును, లోకేష్‌ను దూషించడంతో పాటు టిడిపి కార్యాలయాలపై దాడికి పాల్పడ్డవారిని లక్ష్యంగా చేసుకుని కేసులు పెడుతున్నారు. రాష్ట్రంలో పలుచోట్ల ఈ పద్ధతి కొనసాగుతుండగా... తాజాగా జిల్లాలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబును ఆయన మానసిక స్థితి బాగోలేదని, వైద్యుడికి చూపించాలని మాజీ మంత్రి అప్పలరాజు అన్నట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు..గత ప్రభుత్వ హయాంలోనూ ఇదే తంతు కొనసాగింది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని, ప్రభుత్వాన్ని విమర్శించడమే పాపమన్నట్లుగా టిడిపి నాయకులపై అప్పటి ప్రభుత్వం కేసులు నమోదు చేయించి జైలుకి పంపింది. వైసిపి ప్రభుత్వం రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తుందంటూ అప్పుడు టిడిపి నాయకులు విమర్శించగా... లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతుందంటూ ఇప్పుడు వైసిపి నాయకులు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం అమరావతిలో పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించి పార్టీ నేతలెవరూ వ్యక్తిగత దాడులకు, కక్ష సాధింపులకు దిగొద్దంటూ హితవు పలుకుతున్నారు. తప్పు చేసిన వారిని చట్ట పరంగానే శిక్షిద్దామంటూ ప్రతీకారంతో రగిలిపోతున్న టిడిపి శ్రేణులకు శాంతింపచేసే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగానే అప్పటి వైసిపి నేతలపై ఫిర్యాదులు, కేసులు నమోదు చేయడం జరుగుతున్నాయనేది తేటతెల్లమవుతోంది. టిడిపి కూటమి ప్రభుత్వం అన్నీ ఒకేసారి చేయలేదని, హామీల అమలుకు కొంత సమయం కావాలని చెప్తున్న టిడిపి పెద్దలు కేసులు, కక్ష సాధింపులకు పాల్పడే విషయంలో చాలా వేగంగా పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది. వైసిపి చేసిన తప్పులే మనమూ చేస్తే వారికీ మనకూ తేడా ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ పెద్దలతో చెప్పిన మాటలు నూటికి నూరు పాళ్ల నిజం. అభివృద్ధిని వదిలేసి నియంతృత్వం, తీవ్ర నిర్బంధం, కేసులతో ప్రతికార చర్యలకు పాల్పడటం వల్లే వైసిపికి కనీసం ప్రతిపక్ష హోదా దక్కని దుస్థితి వచ్చింది. దీనిని గుణపాఠంగా నేర్చుకుని అభివృద్ధి వైపుగా టిడిపి కూటమి ప్రభుత్వం అడుగులు వేయాలని అంతా ఆశిద్దాం.

జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే శిరీష

రైతులకు అండగా ఉంటా

ప్రజాశక్తి- పలాస

ఎన్నిక ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిశ్చయంతో వంశధార రైతులకు సాగునీరు అందిస్తున్నామని ఎమ్మెల్యే ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో రైల్వే గేటు సమీపంలో వంశధార కాలువకు శనివారం జల హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభక ముందే శివారు భూములకు సాగునీరు అందించామని తెలిపారు. ప్రతి చేనుకూ సాగునీరు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, బి.నాగరాజు, సప్ప నవీన్, జోగమల్లి సాసుమాన చంద్రమౌళి, కొండే నర్సింహులు, దడే నర్సింహులు, అంబటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రైతులకు కొబ్బరి మొక్కలను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కొబ్బరి మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి- కంచిలి

ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రిమూవల్, రీ ప్లాంట్, రిజువినేషన్ (ఆర్ అండ్ ఆర్) పథకంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే అశోక్, జనసేన సమన్వయకర్త దాసరి రాజు చేతుల మీదుగా పెద్ద కొజ్జిరియాలో శనివారం రైతులకు కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 331 హెక్టార్లలో ఈ పథకం అమలు చేయడం జరిగిందన్నారు. కంచిలి మండలంలోని పెద్ద శ్రీరాంపురం, మకరాంపురం, పెద్దకొజ్జిరియా, చిన్న కొజ్జిరియా, కవిటి మండలంలోని దూగాన పుట్టుగ పంచాయతీల్లో దీనిని అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకంలో భాగంగా కొబ్బరి మొక్కలు అందజేయడంతో పాటు వాటి నిర్వహణకు అవసరమైన సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకాన్ని కొబ్బరి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి పి.మాధవి లత, నాయకులు మాదిన రామారావు, బొడ్డ రాంకుమార్, బి.శోభన్, రైతులు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

స్టేడియం పనులు పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీడల్లో శ్రీకాకుళం జిల్లా కీర్తిప్రతిష్టలు అంతర్జాతీయ స్థాయికి పెంచి ఎంతో మంది క్రీడాకారులను తయారు చేసిన కోడిరామ్మూర్తి స్టేడియం పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. ఈ పనులను పరిశీలించేందుకు ఎమ్మెల్యే గొండు శంకర్ కోడిరామ్మూర్తి స్టేడియంను శనివారం సందర్శించారు. స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో పున: నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో తిరిగి పనులు మొదలయ్యాయి. క్రీడాకారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్టేడియం పున్ననిర్మాణ పనులు పూర్తి చేసేందుకు నిధులిచ్చిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పనులను యుద్ధప్రతిపదికన పూర్తిచేసి స్టేడియంను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని కోరారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు, శాఫ్ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని సన్మానిస్తున్న గ్రామస్తులు

బాధ్యతతో సేవలందిస్తా..

కవిటి: తనపై నమ్మకంతో ఇచ్ఛాపురం నియోజకవర్గం ప్రజలు ముచ్చటగా మూడోసారి గెలిపించారని, దీంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని ఎమ్మెల్యే అశోక్ అన్నారు. మండలంలోని కమలాయిపుట్టుగ గ్రామస్తులు శనివారం ఆయనకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల అభిమానానికి పాత్రుడునైన తాను వారి నమ్మకాన్ని వమ్ము చేయనని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఎల్లవేళలా వారికి అండగా ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని అన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జిపిఎస్ అమలు జిఒ రద్దు చేయాలి

సిపిఎస్ ఉద్యోగుల సంఘం డిమాండ్

శ్రీకాకుళం అర్బన్: సిపిఎస్ ఉద్యోగులకు పాతపెన్షన్‌ను పునరుద్ధరించకుండా గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిపిఎస్‌ను అమలు చేస్తూ... ప్రస్తుత ప్రభుత్వం జిఒ విడుదల చేయడం దుర్మార్గమని సిపిఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుగుబెల్లి భాస్కరరావు, చల్లా దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. 2023 అక్టోబరు నుంచి సిపిఎస్ ఉద్యోగులందరినీ జిపిఎస్‌లోకి తెస్తూ రాజపత్రాన్ని విడుదల చేయడం సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేయడమేనన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకొని అత్యధిక మెజార్టీతో గెలిపించారని అన్నారు. ఎన్నికల సమయంలో పాతపెన్షన్ పునరుద్ధరణకు అధ్యయనం చేసి నిర్ణయం ప్రకటిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం అందుకు భిన్నంగా రాజపత్రాన్ని విడుదల చేశారన్నారు. తక్షణం పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను తక్షణం అమలు చేసి 2003 డిఎస్‌సి ద్వారా నియమితులైన ఉపాధ్యాయులందరినీ తిరిగి పాత పెన్షన్‌లోకి పునరుద్ధరించాలన్నారు. జిపిఎస్ రాజపత్రం విడుదల ఉద్యోగుల్లో ఆందోళనకు గురి చేస్తోందని, అందువల్ల దీన్ని తక్షణమే రద్దు చేయాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్ పుట్టినరోజు

రణస్థలం: మండల కేంద్రంలో ఉన్న ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిధిలో ఉన్న నాలుగు మండలాలకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆగి ఉన్న లారీలతో ప్రమాదాలు

- ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

ఆగి ఉన్న భారీ వాహనాలు ప్రమాదాలకు హేతువులుగా మారాయి. రోడ్డు పక్కన నిలిపిన వాహనాలు ప్రమాదాలకు పిలుపులు అవుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించడంపై మండల ప్రజలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

ప్రజాశక్తి- బూర్జ

శ్రీకాకుళం - పాలకొండ ప్రధాన రహదారికి అనుకుని భారీ వాహనాలను నిలిపి వేయడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బూర్జ మండలంలోని ఉప్పినివలస, సింగన్న పాలెం సమీపంలో, అలాగే కొల్లివలస గ్రామ సమీపం, రాజుపేట, కురుంపేట గ్రామాల సమీపం, తుడ్డలి, డొంకల

తుడ్డలి-డొంకలపర్త సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీలు

పర్త జంక్షన్ వద్ద పదుల సంఖ్యలో భారీ లారీలను నిలిపివేయడంతో రాత్రి వేళల్లో గమనించని ద్విచక్ర వాహనదారులు, ఆటోలు లారీలకు ఢీ కొట్టి ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు తెలిపారు. గతంలో ఇదే రహదారిపై పాలకొండ ఆంధ్ర బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగి మృతి చెందాడని, గురువారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వెళ్తున్న భార్గవ్ కుమార్ ఆగి ఉన్న లారీని ఢీ కొట్టి మృతి చెందాడు. ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న భారీ లారీలు రోడ్డుకు ఇరువైపులా నిలిపి వేయడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో రహదారి గతుకుల మయంగా ఉండడంతో వాటిని తప్పించే ప్రయత్నంలో ఈ లారీలు ఢీ కొడుతున్నారని, అయితే తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నప్పటికీ సంబంధిత అధికారులు, పోలీస్ సిబ్బంది ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో గ్రామస్తులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న గణపతిరావు

కనీస వేతనం అమలు చేయాలి

మందస: మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. స్థానిక మండల కాంప్లెక్స్ ఆవరణలో మధ్యాహ్నభోజన కార్మికుల సంఘం జనరల్ బాడీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన ప్రభుత్వం వచ్చిన తరువాత మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు పెరిగాయాని అన్నారు. 18 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేశారని, ఇప్పటికీ చాలీచాలని జీతంతో అవస్థలు పడుతున్నారని అన్నారు. అలాగే వంట కార్మికులకు గుర్తింపు కార్డులు, దుస్తులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్.దిలీప్‌కుమార్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. ఈ సమస్యల పరిష్కరానికి వంట కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నారు. గౌరవ అధ్యక్షులు పీరుకట్ల వరలక్ష్మి, అధ్యక్షులు దున్న జగదాంబ, ఉప అధ్యక్షులు కె.జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా కె.ప్రభావతి, సహాయ కార్యదర్శులుగా కె.సునీత, సబితా మహారాణి, కమిటీ సభ్యులుగా మర్మ్ బిసాయి, మానిక కిల్లి, జి.సరస్వతి, ఆర్.శాంతి, జి.సత్యవతిలను ఎన్నుకున్నారు.

సన్మానిస్తున్న సంఘ నాయకులు

ఎమ్మెల్యే ఎంజిఆర్‌కు సన్మానం

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక శ్రీశ్రీ కళ్యాణ మండలంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం దుశ్శాలు కప్పి సన్మానించారు. విశ్వకర్మ ఆలయ, కమిటీ హాల్ నిర్మాణాలకు స్థలం కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవి, పొట్నూరు ఉపేంద్రచారి, కృష్ణారావు, వెంకటరమణ, కురుమోజు కృష్ణారావు ఆచారి, సాంబమూర్తి ఆచారి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

పశువులకు వచ్చే ముద్దబంతి (లంపి స్కిన్) వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశుసంవర్థక అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ సుబ్రమణ్యం అన్నారు. శనివారం మండలంలోని షళంత్రిలో పశువులకు నివారణ టీకాలు వేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లంపి స్కిన్ వ్యాధి సోకిన పశువులకు వారం రోజుల తరువాత జ్వరం వచ్చి వారం రోజులు పాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువుల్లో నోరు, ముక్కుల నుంచి ద్రవాలు శరీరమంతా పొక్కులు వస్తాయన్నారు. వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుందని, దాణా తినడానికి ఇబ్బందులు పడతాయని, వ్యాధి సోకిన పశువుల్లో మరణాలు ఎక్కువగా సంభవిస్తాయన్నారు. ఈ వ్యాధి సోకిన పశువును ఇతర పశువులతో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వ్యాధిని నివారించ డానికి గోట్ పాక్స్ వ్యాక్సినేషన్ వేయించాలన్నారు. గ్రామంలో 200 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు సతీష్ కుమార్, పిళ్లా పైడిరాజు, పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విజయకుమార్

రిజర్వేషన్లు కల్పించాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రాష్ట్రంలో 26 లక్షల మంది రెల్లి, ఉపకులాలు ఉన్నా... రాజకీయ, ఆర్థిక, విద్య, ఉపాధి రంగాల్లో ప్రత్యేక రిజ్వేషన్ కల్పించాలని రాష్ట్ర రెల్లీల అధ్యక్షులు గండి విజయకుమార్ కోరారు. స్థానిక రెల్లివీధి సుభాష్‌చంద్రబోస్ కళావేదికలో కోటబొమ్మాళి రెల్లి సంఘం అధక్షులు కుప్పిలి మురళి ఆధ్వర్యాన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం రెల్లి,ఉపకులం అభివృద్ధి జరగాలంటే తరగతి వర్గీకరణ విషయంలో 3 నుంచి 5 శాతం కేటాయించాలన్నారు. రాష్ట్రంలో 26 లక్షల జనాభా ఉన్న ఈ తరగతులకు ప్రత్యేక రిజర్వేషన్ లేక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయంలో ఎలాంటి గుర్తింపు లేదన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గజిటెడ్‌లో రెల్లీలు లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు గొల్లపల్లి మోహనరావు, వెలగాడ గురువులు, కాట సుదర్శన్, పేడాల కనకరాజు, బాత్స నాటరాజు, ఎస్.మురళీమోహన్, సురపల్లి మోహనరావు, ఎన్.విజయకుమార్ పాల్గొన్నారు.

వరిసాగు విస్తీర్ణం పెంపునకు కృషి

రణస్థలం: కిలో బియ్యం పండించడానికి 3600 నుంచి 4 వేల లీటర్ల నీరు అవసరం అవుతుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. శనివారం రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల మండలాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో యంత్రంతో నేరుగా వరిసాగు చేసే క్షేత్రాలను సందర్శించి మాట్లాడారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల వలన వ్యవసాయానికి అనువైన కాలంలో వర్షాలు కురవడం లేదని, ఖరీఫ్ కాలంలో సాగు విస్తీర్ణం పెరగాలంటే తక్కువ నీటితో వరిసాగు చేసే విధానాలను రైతులు అవలంభించాలన్నారు. ముఖ్యంగా ఎరువు, విత్తనాలు ఒకేసారి వేసుకునే 'ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రాలతో ఆరుతడి విధానంలో వరి పండించడం వలన సుమారు 15 నుంచి 20 శాతం నీటిని ఆదాచేయవచ్చునని రైతులకు సూచించారు. ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రంతో నేరుగా వరి విత్తడం వలన తొలకరి వర్షాలను సద్వినియోగం చేసుకోవచ్చని, నారుమడి తయారీ, నాట్లుకు అవసరమయ్యే ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ వాతావరణ కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం డివిజన్‌లో అన్ని మండలాల్లో ఈ యంత్రాలను రైతులకు అందుబాటులో ఉంచామని, రైతులు ఈ యంత్రాలను సద్వినియోగం చేసుకుని మేలైన దిగుబడులు సాధించాలని ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు తెలిపారు. కార్యక్రమంలో సమన్వయ కర్తలు ఎస్.నారాయణరావు, పిషిణి రమణ, రైతు మిత్రలు రెడ్డి సన్యాసిరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల హక్కులను కాలరాస్తే సహించం

మండల సమావేశంలో ఎంపిపి శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి- నందిగాం

అధికారులు ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచ్‌లను, ఎంపిటిసిలను వారి పరిధిలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమాలు తెలియ జేయకుండా వారి హక్కులకు భంగం కలిగిస్తే కోర్టుల ద్వారా సాధించుకుంటామని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా వ్యవసాయ శాఖ నుంచి మండల ఎఒ శ్రీకాంత్‌వర్మ మాట్లాడుతూ ఈ ఏడాది మండలంలో 1200 క్వింటాళ్ల వరి విత్తనాలు సబ్సిడీపై అందించామని అన్నారు. ఇప్పటివరకు మండలంలో 4,833 ఎకరాల్లో ఎదలు జల్లారని అన్నారు. ఇంకా 8,016 ఎకరాలు ఉబాలు చేయడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. యూరియా, డిఎపి అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అలాగే కౌలు రైతులకు కార్డు అందిస్తున్నామని తెలిపారు. దీనిపై సభ్యులు స్పందిస్తూ... సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు సమాచారం ఇవ్వకుండా గ్రామసభలు నిర్వహించారని సభకు దృష్టికి తీసుకొచ్చారు. శివరాంపురం సర్పంచ్ సభ్య జానకిరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 1

మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

నుంచి మలేరియా, డెంగీ, స్టాఫ్ డయేరియా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఉపాధి ఇసి మాట్లాడుతూ పళ్లు, కొబ్బరి, జీడి, మామిడి మొక్కలను రైతులకు అందిస్తున్నామని చెప్పారు. రాంపురం సర్పంచ్ జోగారావు మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించకుండా ఏ పథకాన్ని అందించాలన్న గ్రామసభ నిర్వహించాలని కోరారు. హౌసింగ్ ఎఇ దినేష్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 2,051 మందికి దరఖాస్తు చేసుకున్నారని, అందులో సొంత స్థలం ఉన్నవారు 1430 మంది జగనన్న లేఅవుట్‌లో 621 మందికి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పి.భార్గవి, ఎంపిడిఒ టి.రాజారావు, ఎంఇఒ జి.నరసింహులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఆర్.మధు, ఆర్‌టిసి నుంచి జి.మన్మథరావు, మండల ప్రత్యేకాహ్వానితులు జోగారావు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అప్పలరాజుపై చర్యలు తీసుకోవాలి

ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు కాశీబుగ్గ సిఐ విజయానంద్‌కు శనివారం ఫిర్యాదు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి హోదాలో అప్పలరాజు ప్రతిపక్ష నేతగా ఉన్న నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, దీంతో పాటుగా మీడియాలో ఆయనపై తప్పుడు ప్రచారం చేసినందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుతానని అసెంబ్లీలో ప్రమాణం చేసిన అప్పలరాజు అందుకు విరుద్ధంగా చంద్రబాబునాయుడుపై ఆయన మానసిక పరిస్థితి సక్రమంగా లేదని, వైద్యులకు చూపించాలని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. చంద్రబాబుపై వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. విమర్శలు, ప్రతివిమర్శలతో సాగాల్సిన రాజకీయాలను వైసిపి ప్రభుత్వంలో భ్రష్టుపరిచారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలు మాట్లాడే అసెంబ్లీలో చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తప్పని, ప్రజల్లో ఉండాలంటే విలువైన రాజకీయాలు చేయాలని అన్నారు. నోరు పారేసుకున్న అప్పలరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, దీనిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయాలని కోరారు. ఆమె వెంట టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్ గుప్తా, మల్లా శ్రీనివాస్, జోగ మల్లి, డొక్కరి శంకర్, సాసుమాన చంద్రమౌళి, కొండే నర్సింహులు, నర్సింహులు ఉన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్‌పై వైద్యులకు శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలో రిమ్స్ వైద్య కళాశాల వైద్యులతో పాటు టెక్కలి ఏరియా ఆస్పత్రి వైద్యులకు కేన్సర్ స్క్రీనింగ్‌పై నెలరోజులు సాగిన శిక్షణ శనివారం ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ ఇచ్చారు. విశాఖలోని హోమీబాబా కేన్సర్ ఆస్పత్రి పర్యవేక్షణలో గత నెల 13న ఈశిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఉన్న వైద్య నిపుణులు, సామాజిక వైద్యశాస్త్ర అధ్యాపకులు, గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్లు, రేడియాలజిస్ట్, సాధారణ సర్జన్లు, రేడియేషన్ అంకాలజిస్టులు, సర్జికల్ అంకాలజిస్టులు హాజరై శిక్షణ పొందారు. ఈ శిక్షణ ఆధారంగా కేన్సర్ లక్షణాలను అడ్వాన్స్ స్టేజ్ వరకు వేచి చూడకుండా ముందుగానే గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యం అందజేసి కేన్సర్ బారినుంచి రక్షించేందుకు ఈ శిక్షణ దోహద పడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి వెంకటాచలం తెలిపారు. జిల్లాలో ఉన్న 151 మంది వైద్యులకు, 50 మంది

శిక్షణ పొందుతున్న వైద్యులు

పిహెచ్‌సి హెడ్ క్వార్టర్ ఎఎన్ఎంలు, 594 మంది సిహెచ్ఒ, 53 మంది అర్బన్ ఎఎన్ఎంలకు మూడు బ్యాచ్‌ల వారీగా శిక్షణ పొందినట్టు తెలిపారు. ఒక్కో బ్యాచ్‌కు 40 మంది చొప్పున శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు టెక్కలి జిల్లా ఆస్పత్రిలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతులను ప్రిన్సిపాల్ డాక్టర్ రవి వెంకటాచలం పర్యవేక్షించారు. ముగింపు కార్యక్రమంలో జిల్లా ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ నోడల్ అధికారి డాక్టర్ నాగేంద్ర, డియంహెచ్ఒ డాక్టర్ మీనాక్షి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఎన్‌సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సి.పి.శ్రీదేవి, ఎపిడోమాలజిస్ట్ డాక్టర్ సుజాత, జిల్లా ఎన్‌సిడి టీం సభ్యులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగులకు అవార్డులు

శ్రీకాకుళం అర్బన్: పోస్టల్ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు అన్ని కేటగిరిల్లో డివిజన్ స్థాయి ఎక్స్‌లెన్స్ అవార్డులను ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.శివనాగరాజు అందజేశారు. శనివారం నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో 2023-2024 ఆర్థిక సంవత్సరానికిగాను శ్రీకాకుళం పోస్టల్ డివిజనల్ లెవల్ ఎక్సలెన్స్ అవార్డ్‌ల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సంస్థ ప్రయోజనాలను కాపాడి లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగుల టీం స్పిరిట్ ప్రశంస నీయమన్నారు.

ఈస్ఫూర్తితో రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి సాధించాలన్నారు. పోస్టాఫీసు సూపరింటెండెంట్ వి.హరిబాబు, అసిస్టెంట్ సూపరెంటిండెంట్ కె.శ్యామ్ సుందరరావు, ఎఎస్‌పి ఎ.శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ జిఎం షరీఫ్, ఇతర ఉద్యోగులు హాజరయ్యారు.



ప్రభుత్వం స్థలంలో వేసిన మట్టి

ఈ స్థలంపై మౌనం ఎందుకో?

పోలాకి: పోలాకి కేంద్రంలో ఇందిరా నగర్ కాలనీకి చెందిన నీలి ట్యాంకు ఆవరణలో ఉన్న 126 సర్వే నంబరులో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని కొందరు, కాదు ఆ స్థలం రెవెన్యూ ఉద్యోగికి కేటాయించారని మరికొందరు గుసగుసలు లాడుకుంటున్నారు. ఇలా అందరూలో ఓ చర్చ జరుగుతుంది. ఈ తరుణంలో సదరు వ్యక్తి ఆ స్థలంలో మట్టి వేసి చదును చేయడంతో ఆ చర్చకు ఊతమిస్తోంది. అయితే ఈ విషయం పలు పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. అదికారులకు వివరణ కోరితే... మా దృష్టికి రాలేదనే సమాధానం రావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కథనాలపై జనసేన నాయకులు బలగ ప్రవీణ్ కుమార్ తహశీల్దార్‌కి రెవెన్యూ ఉద్యోగి పేరుపై ఎలా స్థలం కేటాస్తారని ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు మట్టి చదును చేసిన స్థలం వదిలి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో బోర్డు పెట్టి చేతులు దులుపుకున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా ఈ ఫిర్యాదుకి గాని, పత్రికల్లో వచ్చిన కథకాలపై గాని రెవెన్యూ అధికారులు స్పందించి నట్లయితే మట్టి వేసి చదును చేసిన స్థలంలో బోర్డు పెట్టి ఈ స్థలం ఎవరికీ కేటాయించలేదని, ఈ స్థలం ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని బోర్డు పెట్టారు. మరి ఈ విషయంలో రెవెన్యూ అధికారులు మౌనం ఎందుకు వహిస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మిగులుతుంది.

సంఘటనా స్థలంలో నవీన్ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మరొకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పాలవలస జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలవలస గ్రామానికి చెందిన తోట నవీన్ (28) మృతి చెందగా, గోకర్ల శివాజీ పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు బారువ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలవలస గ్రామానికి చెందిన నవీన్, శివాజీలు స్నేహితులు. వీరిద్దరూ ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లి ఇటీవల గ్రామానికి వచ్చారు. నవీన్ శుక్రవారం స్వగ్రామానికి రాగా, శివాజీ 15 రోజుల క్రితం వచ్చాడు. శనివారం రాత్రి వీరిద్దరూ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరి కొర్లం వెళ్తుండగా వెనుక నుంచి లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నవీన్ అక్కడికక్కడే మృతి చెందగా శివాజీ తీవ్ర గాయాల పాలయ్యాడు. సంఘటనపై బారువ ఎస్ఐ చంద్రశేఖరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరికీ వివాహం కాలేదని పోలీసులు తెలిపారు.

ఆర్ఎంపి వైద్యునికి రిమాండ్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వజ్రపుకొత్తూరులోని ప్రైవేట్ క్లినిక్‌కు వచ్చిన వివాహితపై మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసిన కేసులో ఆర్ఎంపి వైద్యుడును అరెస్ట్ చేసి శనివారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. వజ్రపుకొత్తూరు ఎస్ఐ సిహెచ్ రామారావు తెలిపిన వివరాల మేరకు శారదాపురానికి చెందిన దువ్వాడ ఉమామహేశ్వరరావు వజ్రపుకొత్తూరులో ప్రైవేట్ క్లినిక్ నడుపుతున్నాడు. ఈ నెల 9న వైద్యం కోసం క్లినిక్‌కు వచ్చిన వివాహితకు మత్తు మందు ఇచ్చి వివాహితను వివస్త్రను చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆర్ఎంపి వైద్యుడు చేస్తున్న వికృత చేష్టలు వివాహితకు గుర్తు ఉన్నప్పటికీ మత్తు కారణంగా కేకలు వేయడం, ప్రతిఘటించడం చేయలేక పోయింది. ఇంటికి వెళ్లిన తరువాత క్లినిక్‌లో జరిగిన సంఘటన భర్తకు వివరించింది. శనివారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ రూరల్ సిఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ సిహెచ్ రామారావు విచారణ జరిపి అత్యాచారం కేసునమోదు చేసి శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో ఉన్న వ్యక్తి

మందుబాబు హల్‌చల్

టెక్కలి రూరల్ : టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ఇన్‌ఫేషెంట్‌గా చేరిన వ్యక్తి మద్యం తాగి శనివారం హల్‌చల్ సృష్టించారు. దీంతో రోగులు భయాందోళనకు గురయ్యారు. వార్డులోని మంచంపైనే మద్యం తాగి మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించారు. అడిగిన వారిపై ఎదురుదాడికి దిగుతూ హల్‌చల్ చేశారు. దీంతో ఆస్పత్రి సిబ్బంది టెక్కలి పోలీసులు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి వ్యక్తిని స్టేషన్‌కు తరలించారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

కిడ్నీ రోగికి ఆర్థికసాయం

నౌపడ : సంతబొమ్మాళి మండలం బడేకుప్పన్నపేటకు చెందిన కెపి స్పందన ఫౌండేషన్, మనబడి కిడ్నీ వైఫల్యంతో బాధపడుతున్న గయ సందీప్‌కి శనివారం ఆర్థికసాయం అందించారు. సందీప్ గత కొంత కాలంగా కిడ్ని వైఫల్యంతో బాధపడుతున్నాడు. అతని తల్లి కిడ్నీతో శస్త్రచికిత్స చేయించుకున్నారు. దీంతో బాధితుడి సోదరి దీప శనివారం రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో షణ్ముఖరావు మాస్టారు, సూరిబాబు మస్టారు, శివారెడ్డి, అప్పన్న పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా నుంచి వివిధ క్రీడల్లో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే గొండుశంకర్ అన్నారు. శనివారం నగరంలోని ఇండోర్ స్టేడియంలో నారాయణశెట్టి వెంకట శ్రీనివాసులు (వాసు) స్మారక జిల్లాస్థాయి బ్యాడ్మింటెన్ ఛాంపియన్ షిప్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాడ్మింటెన్ అభివృద్ధికి వాసు ఎంతగానో కృషి చేశారన్నారు. అటువంటి క్రీడాకారులు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. వారి స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. బాల బాలికలు, మహిళలు, పురుషుల విభాగాల్లో నిర్వహిస్తున్న పోటీల్లో క్రీడాకారులు తమ సత్తాచాటాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, బాడ్మింటెన్ అసోసి యేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాడుతాం

కవిటి: తమకు శాశ్వత తరగతి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి, తమ బిడ్డలకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని బెంతుఒరియా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సుమన్ బిసాయి అన్నారు. తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 200వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగులు తమ విలువైన అవకాశాలు కోల్పోయి, వెనుకబాటుకు గురవుతున్నారన్నారు. బెంతు ఒరియా మహిళలు చాలావరకు ప్రభుత్వ పథకాలకు దురమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వమైన తమకు న్యాయం చేయాలని కోరారు.

చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

ఎంపిటిసికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- పలాస

మాజీ మంత్రి కార్యాలయంలో మండలంలోని లక్ష్మీపురం ఎంపిటిసి గొండు మోహనరావుకు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు రూ. 50 వేలు చెక్కును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తెలుగుదేశం పార్టీ నాయకులు గొండు మోహనరావుపై దాడి చేశారని, ఈ విషయం మాజీ సిఎం జగన్‌కు దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. దీంతో జగన్ వైసిపి కార్యకర్తలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఆర్థికసాయం అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు పైల వెంకటరావుచిట్టి, సర్పంచ్ ప్రతినిధి పర్ల మురళీకృష్ణ చౌదరి, ఎంపిటిసి బమ్మిడి దుర్యోధన పాల్గొన్నారు.

వైసిపి నాయకులను పరామర్శ

పోలాకి సరోజినమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న అప్పలరాజు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విశ్రాంత అధ్యాపకుని ప్రతిభ

ప్రజాశక్తి- కవిటి

వెంకటరమణ

పిహెచ్‌డి ప్రవేశానికి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఆర్ సెట్ వృక్షశాస్త్ర విభాగంలో 6వ ర్యాంకు సాధించి చదువుకు వయసు అడ్డుకాదని నిరూపించారు కవిటికి చెందిన విశ్రాంత వృక్షశాస్త్ర అధ్యాపకులు ప్రగడ వెంకటరమణ. శుక్రవారం రాత్రి విడుదలైన ఎపి ఆర్ సెట్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో తనకు 6వ ర్యాంకు వచ్చినట్టు వెంకటరమణ తెలిపారు. పదేళ్లుగా విశ్రాంత జీవితం గడుపుతున్న ఆయన నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడంతో పాటు పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచేవారికి తన తల్లి ప్రగడ బుచ్చమ్మ పేరుమీదుగా ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. అంతేకాకుండా తన ఉద్యోగ జీవితం ప్రారంభం నుంచే ఉద్దానం ప్రాంతంతో పాటు సమీపంలోని ఒడిశా తదితర ప్రాంతాల్లో అంతరించిపోతున్న, అతి విలువైన మొక్కలు, తీగజాతులపై పరిశోధనలు చేస్తున్న వెంకటరమణ వృక్షశాస్త్రానికి సంబంధించి జాతీయ స్థాయిలో పదుల సంఖ్యలో వ్యాసాలు రాసి వృక్షశాస్త్ర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ నాయుడు

రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని కాంట్రాగడ రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు ఉంటాయని తహశీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు ఆక్రమణదారులకు హెచ్చరించారు. మండలంలోని కాంట్రాగడ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 59/1ఎ సోషల్ వెల్ఫేర్ స్థలం చాలా ఏళ్ల నుంచి ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ఉందని అన్నారు. ఆ భూముల పైనేనుంచే రైతుల భూములకు వెళ్లాల్సి ఉందన్నారు. అయితే గ్రామానికి చెందిన సరస్వతి అనే మహిళ రైతులకు ఇబ్బందులు పడుతున్నారని, రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆక్రమణ స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. పూర్తిస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

క్రీడాకారుల ప్రోత్సాహానికి మైదానాలు అవసరం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

క్రీడాకారులను ప్రోత్సహించడానికి క్రీడా మైదానాలు అవసరమని జనసేన నియోజక వర్గ సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు అన్నారు. శనివారం కొమరల్తాడ, తామాడపేట యువత పాఠశాలలో క్రీడా మైదానాలు అభివృద్ధి కోసం జనసేన వజ్రపుకొత్తూరు క్లస్టర్ ఇన్‌ఛార్జి దువ్వాడ వంశీకృష్ణ చౌదరితో కలిసి సమన్వయకర్త దుర్గారావుకు వినతిపత్రం అందించారు. పాఠశాలలో సుమారు 90 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. అదేవిధంగా ఈ ప్రాంత రైతుల కోసం కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని దుర్గారావు హామీ ఇచ్చారు. వినతిపత్రం

దుర్గారావుకు వినతిపత్రం అందజేస్తున్న యువత

అందించిన వారిలో కొమరల్తాడ జనసేన అధ్యక్షుడు చింత మోహనరావు, తామాడ లక్ష్మణరావు, మాగుబరి తులసీదాస్, మండల మహేష్, లిమ్మాడ నాగరాజు, దండుపాటి పవన్ కుమార్, చొక్కాల గణేష్ తదితరులున్నారు.

పేదల పక్షపాతి చౌదరి సత్యనారాయణ

విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న ధనలక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పేదప్రజల పక్షపాతిగా నిరాడంబర జీవితాన్ని కొనసాగించిన స్వాతంత్ర్య సమర యోధులు దివంగత చౌదరి సత్యనారాయణ అని, ఆయన ఆశయాలు భావితరాలకు ఆదర్శమని మాజీ జెడ్‌పి ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, ఎన్‌జిఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, టిడిపి పూర్వ జిల్లా అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి కొనియాడారు. నగరంలోని సింహద్వారం వద్ద శనివారం ఆయన జయంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యనారాయణ స్వాతంత్ర్య సమరయోధులుగా జాతిపిత మహాత్మాగాంధీతో కలిసి జైలు జీవితాన్ని అనుభవించారని గుర్తు చేశారు. సర్దార్ గౌతు లచ్చన్న, ఎన్.జి.రంగాలతో కలిసి ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించారన్నారు. రైతు సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని, ప్రజలు ఆయనకు ఎస్ఎంపురం, పొందూరు నియోజకవర్గాల నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా శాసనసభకు పంపారన్నారు. 12ఏళ్ల పాటు శాసనసభ్యునిగా ప్రజా సమస్యలపై తన గళం వినిపించారన్నారు. సైకిల్‌పై ఊరూరా తిరుగుతూ, చాపపైనే నిద్రిస్తూ సామాన్య జీవనాన్ని గడిపారన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తాండ్ర అరుణ, చౌదరి రవీంద్ర, చౌదరి అవినాష్, చౌదరి సతీష్, బొడ్డేపల్లి రమేష్, తాండ్ర సునీల్, బొడ్డేపల్లి క్రాంతికుమార్, బొడ్డేపల్లి రవి పాల్గొన్నారు.

గతాన్ని, వర్తమానాన్ని గుర్తు చేసేది కళారంగం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మానవ గతాన్ని, వర్తమానానికి ప్రతిరూపం కళారంగమని ప్రముఖ వ్యాపారవేత్త పొట్నూరు వెంకటరమణ అన్నారు. శనివారం బాపూజీ కళా మందిరంలో బాలు స్వరనీరాజనం కార్యక్రమాన్ని జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిర్వహించారు. స్వర్గీయ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కళాకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. నగరంలో ఉన్న కళాకారులంతా సమిష్టిగా ఒకే వేదికపై నుంచి నిరుపేద కళాకారులకు నిత్యావసర సరుకులు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ డిప్యూటీ గవర్నర్ శాసపు జోగి నాయుడు మాట్లాడుతూ పేద కళాకారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అర్హులైన కళాకారులకు తక్షణమే పింఛన్లు మంజూరు

బాలు విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న కళాకారులు

చేయాలని కోరారు. ముందుగా స్వర్గీయ ఘంటసాల, బాలు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు బొడ్డేపల్లి శివశంకర్, కూన అనిల్ కుమార్, సింహాద్రి శ్రీనివాసరావు, తండాన శ్రీనివాసరావు, కుప్పిలి భానుమతి, చిట్టూరు దామోదరరావు పాల్గొన్నారు.

రహదారి ఇలా... రాకపోకలు ఎలా..!

ప్రజాశక్తి- పొందూరు

రహదారిపై వర్షపునీరు నిలిచిపోయి రాకపోకలు సాగించేందుకు వీలులేకుండా కనిపిస్తున్న ఈ దృశ్యం మండలం తోలాపి గ్రామంలోనిది. గ్రామంలో ఎస్‌సి కాలనీకి వెళ్లే ఈ రహదారిలో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు నీరు నిలిచిపోయి రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారి ఎత్తుగా ఉండడంతో ఈ రహదారి లోని నీరు బయటకు వెళ్లే మార్గం లేక నీరు ఇలాగే నిలిచిపోతుందని కాలనీవాసులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ రహదారిపై మహిళలు, వృద్ధులు, చిన్నారులు రాకపోకలు సాగించేందుకు నానా

ఎస్‌సి కాలనీలో రహదారిపై నిలిచిన వర్షపునీరు

అవస్థలు పడాల్సి వస్తుందని అంటున్నారు. అధికారులు డ్రై డే..ఫ్రైడే అంటూ పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రచారాలు చేస్తున్నారు తప్పా ఎంతో కాలంగా ఉన్న ఈ సమస్యను మాత్రం పరిష్కరించడం లేదని వాపోతున్నారు. వర్షాకాలం కావడంతో నీరు ఇలా నిలిచిపోతే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

జిపిఎస్ గెజిట్ ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చే పెన్షన్‌ను గ్యారెంటీ పెన్షన్ స్కీంలోకి తీసుకు వస్తూ ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంపై ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మజ్జి మదన్ మోహన్, ఎస్.వి.అనిల్ కుమార్ ప్రకటన విడుదల చేసి అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన గజిట్ నోటిఫికేషన్‌ను తక్షణమే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, కార్మికులకు మోసం చేస్తూ గ్యారెంటీ పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చిందని, అదే విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తూ ఉద్యోగులకు నష్టపర్చడం సరికాదన్నారు. ఈ విధానాన్ని ఉపసంహరించు కోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రక్తదానం చేస్తున్న జనసేన కార్యకర్తలు

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జనసేన ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ విశ్వక్సేన్ జన్మదినాన్ని సందర్భంగా నగరంలోని తోటపాలెం రోడ్డులో ఉన్న ఆయన స్వగృహంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 123 మంది జనసేన కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ దానేటి శ్రీధర్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సతీమణి ప్రభ, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తనయుడు తేజ, జిల్లాలోని వివిధ నియోజకవర్గాల జనసేన ఇన్‌ఛార్జిలు హాజరై కేకు కట్‌చేసి ఆయనను అభినందించారు.

నేడు 'సంధ్యావేళ సరాగాల హేళ'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విశాఖపట్నం నారీభేరీ సంస్థ, కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా ఈ నెల 14న సాయంత్రం 5.30 గంటల నుంచి ఎన్‌జిఒ హోంలో సంధ్యావేళ... సరాగాల హేళ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు కింతలి భాగ్యలక్ష్మి ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సినీ సంగీత విభావరి సంగీత ప్రియులకు ఆకట్టుకుంటుందన్నారు. గాయనీ, గాయకులు కార్యక్రమంలో పాల్గొని తమ గాత్రాన్ని శ్రోతలకు వినిపిస్తారని ఆమె వివరించారు.

దళిత సంఘాల ర్యాలీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పోలీసు ఉన్నతాధికారిగా ఉన్న పివి సునీల్‌కుమార్‌పై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అభ్యంతరకరమని అంబేద్కర్ ఇండియా మిషన్ నాయకులు శ్రీను పేర్కొన్నారు. శనివారం ఆయనకు మద్దత్తుగా దళిత సంఘాల ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీను మాట్లాడుతూ సరైన సమయంలో ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు మాలలంతా సిద్ధమవుతామని హెచ్చరించారు. దళితుడైన సీనియర్ ఐపిఎస్ అధికారి పి.వి.సునీల్ కుమార్‌పై పోలీసులు కేసునమోదు చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. తక్షణమే ఆయనపై కేసులు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత జెఎసి నాయకులు డా.కంఠ వేణు, యజ్జల గురుమూర్తి, బూరెల్ల శంకర్, తవిటినాయుడు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు